క్లుప్తంగా

కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో



కొత్తపల్లి జలపాతం వద్ద పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ శుక్రవారం రాత్రి సందర్శించారు. పీవోకు పోలవరం అడ్మినిస్ట్రేటర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. బదిలీపై వెళ్తున్న పీవో అభిషేక్‌కు కొత్తపల్లి గ్రామస్తులు, జలపాత నిర్వాహకులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి జలపాతాన్ని ఆయన తిలకించారు. జలపాత నిర్వాహకులతో ఫోటోలు దిగారు.

ఆత్మీయ వీడ్కోలు



ఐటీడీఏ పీవో అభిషేక్‌ను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

సాక్షి, పాడేరు: పోలవరం ప్రాజెక్టుకు బదిలీపై వెళ్తున్న పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ను అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాడేరు సబ్ కలెక్టర్‌గా, ఐటీడీఏ పీఓగా అభిషేక్ చేసిన సేవలను ఎమ్మెల్యే మత్స్యలింగం కొనియాడారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న వైద్యాధికారి రాంబాబు

డుంబ్రిగుడ: చిన్నారుల్లో నులిపురుగు నివారణకు కృషి చేద్దామని డుంబ్రిగుడ వైద్యాధికారి పి.రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలిక ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్నారులకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని, తద్వారా చిన్నారుల ఎదుగుదలకు తోడ్పాటుకావాలన్నారు. ఎంఈవో శెట్టి సుందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కౌట్ జెండా ఆవిష్కరణ



స్కౌట్ జెండాను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొయ్యూరు: స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-1లో శుక్రవారం స్కౌట్ జెండాను హెచ్‌ఎం ఎస్.బక్తవత్సలమూర్తి ఆవిష్కరించారు. పీడీ శివప్రసాద్ స్కౌట్ మష్టారుగా శిక్షణ పొంది జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు.ఆయన 32 మంది విద్యార్థులతో స్కౌట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మూర్తి మాట్లాడుతూ స్కౌట్ అంటే సేవ చేయడమేగా పరిగణించాలన్నారు. క్రమశిక్షణ, సమయపాలన లాంటివి విద్యార్థులకు వస్తాయన్నారు. పీడీ కె.శివప్రసాద్, వార్డెన్ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడైన చేతి బోర్లకు మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: మండలంలో పాడైన చేతిబోర్లకు మరమ్మతు పనులను వేగవంతం చేసినట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మార్చి 15వరకూ సమ్మర్ క్రాష్ ప్రోగ్రం జరుగుతుందన్నారు. మండలంలో 247 చేతి పంపులున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాడైన చేతిపంపులను గుర్తించి వాటిని బాగు చేయిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని బోనంగిపల్లి, గొందిపల్లి గ్రామాల్లో చేతిపంపులకు మరమ్మతు పనులు చేయించినట్టు చెప్పారు.

ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి ఎదుట బాధితురాలు లక్ష్మి

అడ్డతీగల: మండలంలోని గొంటువానిపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో దూది లక్ష్మి అనే మహిళ ఇల్లు దగ్ధమైంది. ఇంటిలోని రూ.15 వేలు నగదు, దుస్తులు ఇతర సామగ్రి సర్వం అగ్నికి ఆహుతైనట్టు ఆమె తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్టు చెప్పారు. ఆమెకు ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ప్రయాణం.. ప్రమాదకరం



ప్రమాదకర వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు, వాహనచోదకులు



పాడేరు ఘాట్‌రోడ్డులో జీపు టాప్‌పైకి ఎక్కి ప్రయాణిస్తున్న గ్రామస్తులు

- ప్రమాదకరంగా జోలాపుట్టు వంతెన
- దెబ్బతిన్న రక్షణగోడలు
- తూతూ మంత్రంగా మరమ్మతులు
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాలను కలిపే సరిహద్దు ఐరన్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతు పనులు చేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో జోలాపుట్టు నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకోవడంతో జలాశయం నుంచి 50వేల క్యూసెక్కుల నీరు ఒకేసారి విడుదల చేశారు. నీటి ప్రవాహం ఎక్కువై ఇరురాష్ట్రాల ప్రజలు వినియోగించే ఐరెన్ వంతెనపై వరదనీరు పోటెత్తింది. దీంతో వంతెన ముందు భాగం పూర్తిగా కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఈ కారణంగా ప్రభుత్వ అధికారులు హుటాహుటిన ఐరెన్ వంతెన ముందు భాగంలో తాత్కాలికంగా మట్టి పోసి, రాళ్లు ఏర్పాటు చేశారు. కానీ ప్రాజెక్టు అధికారులు మాత్రం ఐరెన్ వంతెన పనులపై ఎటువంటి దృష్టి పెట్టలేదు. ప్రస్తుతం వంతెనపై పలుచోట్ల తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడ్డాయి. వంతెనపై పలుచోట్ల రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొంతమేర మరమ్మతులు చేసినా రక్షణగోడలు సక్రమంగా లేకపోవడంతో వెదురు కర్రలను తాత్కాలికంగా అమర్చారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయం భయంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. వాహనచోదకులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదాలు తప్పవని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరురాష్ట్రాల ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో జోలాపుట్టు జలాశయం వంతెనపై నుంచి రాకపోకలు చేస్తున్నారు. దీంతో జలాశయానికి సైతం ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి ఐరెన్ వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని, జోలాపుట్టు సరిహద్దులో పూర్తిస్థాయిలో వంతెనను నిర్మించి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న జోలాపుట్టు ఐరెన్ వంతెన

ఆదమరిస్తే.. అంతే

పాడేరు రూరల్: ప్రమాదకర పరిస్థితుల్లో గిరిజనులు ప్రయాణాలు సాగిస్తున్నారు. మండలంలో కుజెలి, వంతాడపల్లి పంచాయతీల పరిధిలో ఉన్న మారుమూల గ్రామలు అల్లివరం, జోడిమామిడి, డల్లాపల్లి, సప్పిపుట్టు, హుకుంపేట మండలాలకు చెందిన కంద్రపాడు వివిద గ్రామల నుంచి పాడేరు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు సరైన రవాణా సదుపాయం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సర్వీసులు లేక ప్రైవేట్ జీపులు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ప్రైవేట్ జీపులు, ఆటోల్లో తీసుకెళ్తున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఘాట్‌రోడ్డు మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. పరిమితికి మించిన ప్రయాణికులతో ఈ మార్గంలో జీపులు, ఆటోలపై వెళ్తూ ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కోకొల్లలు. జీపు టాప్‌పై ప్రయాణికులను ఎక్కించుకొని డ్రైవర్లు రాకపోకలు సాగిస్తున్నారు. గత్యంతరం లేక అమాయక గిరిజనులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. తమ గ్రామాలకు బస్సు సర్వీసు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసినా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని పలువురు గిరిజనులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు మన్యంలో గ్రామాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి గ్రామాలకు ఆర్టీసు బస్సు సర్వీసు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఈ విషయాన్ని ఆర్టీవో లీలాప్రసాద్ వద్ద ప్రస్తావించగా ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రతి మారుమూల గ్రామాల నుంచి సర్వీసులు చేస్తున్న ప్రైవేట్ జీపులు, ఆటోలు ఇతరత్రా వాహనాలపై నిఘా పెట్టామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులతో సర్వీసులు చేస్తున్న డ్రైవర్లపై చర్యలు తీసుకుంటున్నామని, జరిమానా విధిస్తున్నామన్నారు. జీపు, ఆటో డ్రైవర్లు తరచూ నిబంధనలు ఉల్లంఘించి తీరుమార్చుకోకపోతే వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: క్రమశిక్షణ,నిరంతర సాధనతోనే క్రీడల్లో రాణించవచ్చని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. మండలంలోని జర్జుల పంచాయతీ గుంజిరిసంతా గ్రామంలో ఈ నెల 26న నిర్వహించనున్న శివలింగేశ్వర స్వామి పండుగను పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు క్రికెట్ పోటీలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. గిరిజన యువతలో అపారమైన ప్రతిభ ఉందని, దానిని ప్రదర్శిస్తే, వారి భవిష్యత్తు బంగారు బాటవుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు రామారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి ఆర్థిక సాయం



ఇందుకూరుపేట-గోపాలపురం మధ్య రోడ్డుపై గోతులు పూడ్చుతున్న దృశ్యం

దేవీపట్నం: దేవీపట్నం మండలం ఇందుకూరు నుంచి మైదాన ప్రాంతం గోపాలపురం వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు నిర్మాణానికి విశ్వహిందూ ధర్మ పరిక్షరణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆర్థిక సాయమందించారు. గ్రామస్తులకు రూ. 50వేలను అందించారు. ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు. గోపాలపురానికి చెందిన బలిజ బాబురావు ఆధ్వర్యంలో గ్రామస్తులు సమస్యను కంబాల శ్రీనివాసరావు దృష్టికి తీసుకురావడంతో ఆర్థిక సాయమందించారు. గోతులను పూడ్చే పనులు ప్రారంభించారు. రోడ్డుకు ఇంకా అవసరమైన నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు గ్రామస్తులకు తెలిపారు. రామసేన సభ్యులు అయ్యప్ప, బాపన్నదొర, ప్రసాద్, డాక్టర్ జగన్నాథరావు శర్మ, కట్టా, గ్రామస్తులు బ్రహ్మాజీ, సాయిబాబు, రాజు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక తనిఖీ ఎస్‌ఆర్పీ వెంకటరమణ

జి.మాడుగుల: అక్రమాలకు తావులేకుండా పాఠశాలలను నిర్వహించాలని సామాజిక తనిఖీ ఎస్‌ఆర్పీ వెంకటరమణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సామాజిక తనిఖీ జరిగింది. పాఠశాల నిర్వహణపై వివరాలను సేకరించారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని, తరగతి గదిలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లను వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన విద్యను అందించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో వి.కోడాపల్లి, గురుకులం పాఠశాల, కెజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బొర్రతాడి మండల పరిషత్ పాఠశాలలో సామాజిక తనిఖీ చేశామన్నారు.నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. హెచ్‌ఎం నాగరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ బుజ్జిమతి, సామాజిక తనిఖీ డీఆర్పీ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గురుకుల కళాశాల వార్షికోత్సవం



విద్యార్థుల నృత్యం

జి.మాడుగుల: విద్యార్థులు లక్ష్యసాధనతో చదువుల పట్ల దృష్టిసారిస్తే ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చని గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ పారయ్య తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలంటే చిన్ననాటి నుంచే లక్ష్యసాధన అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలు సాకారాన్ని పిల్లలు పట్టుదలతో సాధించాలన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



కొర్రలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ, ఎంపీటీసీ విజయ, సర్పంచ్ అర్జున్

డుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయతీ కొర్ర గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్టు ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ తెలిపారు. గ్రామంలో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో కొర్ర గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యురాలు జి.విజయ, సర్పంచ్ అర్జున్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం స్థలాన్ని పరిశీలించామన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బాల్య వివాహాలు, పౌష్టికాహారం లోపం, విద్యార్థుల డ్రాప్‌అవుట్, కిశోర బాలికలకు ఆరోగ్య భద్రత తదితర అంశాలపై మాట్లాడారు. సూపర్‌వైజర్ శిరీష, ఆర్‌ఐ కోటి, పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన అవసరం



పద్మాపురం గార్డెన్ వద్ద విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఫీల్డ్ ట్రిప్ మరియు బొటానికల్ టూర్‌లో భాగంగా పద్మాపురం, కొత్తవలసలోని బొటానికల్ గార్డెన్‌లను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు వృక్ష శాస్త్ర అధ్యాపకులు బి.లచ్చన్న పర్యవేక్షణలో టూర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఔషధ మొక్కల పరిరక్షణ, ఆయుర్వేద, అలంకరణ మొక్కలు, సైకాస్, పైనాస్ మొక్కల జాతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశీలనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

కొనసాగుతున్న భూ బాధితుల దీక్ష



దీక్ష చేస్తున్న భూ బాధితులు

డుంబ్రిగుడ. మండలంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణం కోసం భూములు ఇచ్చిన భూ బాధితుల దీక్ష శుక్రవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. భూ బాధితులు డొండు, రాంచందర్ మాట్లాడుతూ తమకు న్యాయం జరిగేంత వరకు దీక్షను కొనసాగిస్తామన్నారు. 15 రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు, యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాందాస్, మాజీ సర్పంచ్ మొద్దో, కాంగ్రెస్ నాయకులు పరశురాం, దయనిధి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల జోలికొస్తే ఖబడ్దార్



అరకులోయలో నినాదాలు చేస్తున్న పీసా కమిటీ ప్రతినిధులు



ముంచంగిపుట్టులోని సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి నర్సయ్య



చింతూరులో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు సురేష్

అరకులోయటౌన్: గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 భూ బదలాయింపు చట్టం జోలికొస్తే ఖబడ్దార్ అని పీసా కమిటి కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. శుక్రవారం గిరిజన సంఘం కార్యలయంలో పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు గిరిజన చట్టాలపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 11, 12 తేదీల్లో చేపడుతున్న మన్యం బంద్‌కు పీసా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తెలపాలన్నారు. గిరిజన చట్టాలు, హక్కుల జోలికొస్తే సహించేది లేదన్నారు. షెడ్యూల్ ఏరియాలో వందశాతం గిరిజన అభ్యర్థులచే ఉద్యోగాల నియామక చట్టం తీసుకురావాలన్నారు. స్పెషల్ డిఎస్సీ ప్రకటించాలని, పాడేరు మెడికల్ కళాశాలలో స్థానిక గిరిజనులతో అన్ని ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీసా కమిటీ ప్రతినిధులు ఆనంద్‌రావు, రమేష్, జగన్నాథం, నూతన ప్రసాద్, రామన్న, రామారావు, గురుమూర్తి, దాశరథి, నాగులు, గురు, సురేష్, అర్జున్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: గిరిజన చట్టాలు, హక్కులను సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటు అని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎంఎం శ్రీను, కె.నర్సయ్య, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణలు అన్నారు. మండల కేంద్రంలో గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం నేతల సమావేశం నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 11, 12 తేదీల్లో చేపడుతున్న మన్యం బంద్‌కు గిరిజన సంఘం పూర్తిగా మద్దతూ తెలుపుతుందన్నారు. తక్షణమే అయ్యన్నపాత్రుడు భేషరత్‌గా క్షమపణ చెప్పాలని, ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, మన్యం బంద్‌కు అన్ని వర్గాలు పూర్తి సహకారం అందించాలన్నారు. నాయకులు చందు, కృష్ణ, చిన్నారావు పాల్గొన్నారు.

చింతూరు: 1/70 చట్టంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అయ్యన్నపాత్రుడి తీరును నిరసిస్తూ ఆదివాసీ గిరిజన సంఘాలు అఖిలపక్షంగా ఈనెల 11,12 తేదీల్లో నిర్వహిస్తున్న బంద్‌ను విజయవంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట నాయకుడు సీసం సురేష్ కోరారు. చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయన్నపాత్రుడు ఆదివాసీ చట్టాలు, హక్కులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని, అతనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థల అధినేతల కోసం ఆదివాసీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను దోచిపెట్టేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అయన్నపాత్రుడు ఆదివాసీ సమాజానికి క్షమాపణలు చెప్పాలని, ముఖ్యమంత్రి చొరవ తీసుకుని వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజయ్య, లెనిన్, సుబ్బారావు, నాగార్జున, దిలీప్ పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ



రగ్గులను పంపిణీ చేస్తున్న సంస్థల ప్రతినిధులు

చింతపల్లి: లంబసింగి పంచాయతీలోని పలు గ్రామాల్లో గిరిజనులకు తమ సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు హ్యాండ్స్, మాతృభూమి, సన్‌చారిటీ సంస్థల ప్రతినిధులు గోపాలరావు, సురేంద్ర, రామ్మోహన్ అప్పలనాయుడు తెలిపారు. చెక్కరాయిబంద, జల్లూరిమెట్ట గ్రామాల్లో గిరిజనులకు రగ్గులను శుక్రవారం పంపిణీ చేశారు.

62 మందికి వైద్య పరీక్షలు



పాలమామిడిలో వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్

జి.మాడుగుల: మండలంలోని పాలమామిడి సచివాలయంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ పాల్గొని శిబిరంలో 62 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చర్మవ్యాధులతో ఉన్న 12 మంది పిల్లలకు వైద్యం అందించారు. జ్వరాలతో ఉన్న నలుగురుకు రక్తపూతలు తీసి మందులు అందజేశారు. గిరిజన ప్రజలకు పలు ఆరోగ్యపరమైన సూచనలు సలహాలిచ్చారు. వాతావరణ మార్పుల వలన ప్రబలే వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు వస్తే తక్షణమే పీహెచ్‌సీ, వైద్య సిబ్బంది సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి నడికట్ల ప్రకాష్, ఏఎన్‌ఎంలు మార్తమ్మ, సత్యవేణి, హెల్త్ అసిస్టెంట్ గిరధర్ పాల్గొన్నారు.

చిరుజల్లులతో ఉపశమనం



బడదనాంపల్లి శివారులో కురుస్తున్న వర్షం

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి, లక్కవరప్పాడు, అమ్మిరేఖల తదితర లోతట్టు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఈ వర్షం అటవీ ప్రాంతంలో కొండపోడు భూముల్లో సాగవుతున్న పొగాకు తోటలకు మేలు చేస్తుందని రైతులు చెప్పారు. సుమారు రెండు నెలల తరువాత వర్షం కురవడంతో ఈ ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. అలాగే వర్షం అనంతరం కొండలపై పొగ మంచు అలముకొంది. వాతావరణం చల్లబడడంతో స్థానికులు ఉపశమనం పొందారు.